RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 421 | 12 ఆదివారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## బ్యారేజీ గేట్లు మూస్తే
# కూలిపోతాయి

### : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక



కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల పునరుద్ధరణ పనులు పూర్తికాకుండా గేట్లు మూసివేస్తే, వాటి మనుగడకే పెను ప్రమాదం వాటిల్లుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. బ్యారేజీల భద్రత విషయంలో నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను తు.చ. తప్పకుండా పాటించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డను వెన్నెముకగా, శ్రీపాద యల్లంపల్లిని గుండెకాయగా అభివర్ణించారు. మేడిగడ్డ నిర్మాణ సమయంలో ఎదురయ్యే సవాళ్లపై గత ప్రభుత్వ హయాంలోనే ఇంజనీర్లు హెచ్చరించినప్పటికీ, కొందరు అధికారులు ఇప్పుడు మాట మారుస్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీ చేసిన సూచనలనే తమ ప్రభుత్వం పాటిస్తుందని, బీఆర్ఎస్ నేతలతో కూడిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవడం లేదని తేల్చిచెప్పారు. "పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా గేట్లు మూసివేస్తే బ్యారేజీలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిర్మాణాలు స్థిరంగా ఉన్నప్పుడే నీటి నిల్వ, పంపింగ్ సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డలో కనీసం 5 టీఎంసీల నీటి నిల్వ అవసరమని, అయితే భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిపుణుల సలహాల మేరకే తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, లోపభూయిష్టమైన ప్రణాళికల వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి దాపురించిందని ముఖ్యమంత్రి విమర్శించారు. భద్రాచలం వంటి ప్రాంతాలు ముంపునకు గురయ్యేలా నీటిని ఎత్తిపోసే ప్రసక్తే లేదని, ప్రజల భద్రతకు, ప్రభుత్వ వనరులకు నష్టం కలగకుండా ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఎస్.జానకి మృతి పట్ల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి



భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తీవ్ర విషాదం నెలకొంది. 'దక్షిణ భారత గాన కోకిల'గా సుపరిచితురాలైన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి శనివారం కర్ణాటకలోని మైసూరులో కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆరు దశాబ్దాలకు పైగా తన మధుర స్వరంతో కోట్లాది మంది సంగీత ప్రియులను అలరించిన జానకమ్మ మరణంతో భారతీయ సంగీత రంగంలో ఒక శకం ముగిసింది. ఎస్. జానకి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన గాత్రంతో నవరసాలను పలికించిన ఆమె, తాను తెలుగు గడ్డపై జన్మించినందుకు ఎల్లప్పుడు గర్వంగా భావిస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఆమె మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు, సంగీత ప్రియులకు తీరని లోటని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. దక్షిణ భారత చలనచిత్ర సంగీత ప్రపంచంలో జానకి గారు తన గళమాధుర్యంతో శ్రోతల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని సీఎం కొనియాడారు. అనేక చిత్రాల్లో పాత్రోచితంగా, సన్నివేశాలకు అనుగుణంగా భావోద్వేగాలను పలికిస్తూ ఆమె పాడిన పాటలు సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశాయని పేర్కొన్నారు. తెలుగు, తమిళం, హిందీ సహా మొత్తం 17 భాషల్లో దాదాపు 50 వేల గీతాలను ఆలపించి, ఎన్నో జాతీయ పురస్కారాలను కైవసం చేసుకున్నారని స్మరించుకున్నారు. జానకి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకతప్త హృదయాలైన వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్




ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ వైమానిక సంస్థ 25వ వార్షికోత్సవాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లో ఈ భేటీ జరిగింది. తెలంగాణలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం జరగబోతోందని... రాష్ట్రానికి ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరింత పెంచాలని ఈ సందర్భంగా సార్ధన్ ను రేవంత్ రెడ్డి కోరారు. దీంతో, హైదరాబాద్‌కు ఏ-380 విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఎమిరేట్స్ సంస్థ ఆసక్తి చూపించింది. ఎమిరేట్స్‌కు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అంతేకాకుండా గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పాన్సర్‌షిప్ అందించాలని రేవంత్ రెడ్డి కోరగా, ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు. త్వరలో తెలంగాణలో వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొత్త విమానాశ్రయాలను నిర్మించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విమాన సర్వీసులు పెంచాలని ఎమిరేట్స్ ను రేవంత్ కోరారు.

## ఎంత ఖర్చైనా నేనున్నా

### : చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు రాజగోపాల్ రెడ్డి అభయం



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకొని ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. తల్లిదండ్రులు లేక, తీవ్ర అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఒక చిన్నారికి తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా పూర్తి ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన మనవడిని బతికించాలంటూ ఒక వృద్ధుడు కన్నీరుమున్నీరవుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని ఆశ్రయించారు. తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఆ చిన్నారి మాత్రమే తనకున్న ఏకైక ఆస్తి అని, ఎలాగైనా కాపాడాలని ఆ తాత ఎమ్మెల్యే కాళ్లపై పడి తన ఆవేదనను వెళ్లగక్కారు. ఆ వృద్ధుడి కష్టాన్ని చూసి చలించిపోయిన రాజగోపాల్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఆ చిన్నారి ప్రాణాలు కాపాడటానికి ఎంత ఖర్చైనా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. తమ ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్ తో పాటు పూర్తి ఉచిత వైద్యం అందించి, బాబును మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి పంపే బాధ్యత తనదేనని కొండంత భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న తమను దేవుడిలా ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆ వృద్ధుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది.

## రైతాంగాన్ని రేవంత్ నిలువునా
# ముంచేస్తున్నారు
### : కేటీఆర్




తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ..

రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

## పోక్సో కేసులకు తెలంగాణ అడ్డాగా మారింది

### : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో పోక్సో కేసు కక్షతో... ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ కేసు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పటోళ్ల కార్తీక్ రెడ్డి వంటి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో ఈ అరెస్టులు జరిగాయి. ఈ నేపథ్యంలో, బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రం పోక్సో కేసులకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. ప్రభుత్వం నిందితుడిని అరెస్టు చేయకుండా బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. నిందితుడు ఇంకా పరారీలో ఉండటం దారుణమని అన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

## పక్కా వ్యూహాలతో రేవంత్ రెడ్డి వేగం పెంచారు : జగ్గారెడ్డి




వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ గెలిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా వ్యూహాలతో వేగం పెంచారని, ఆయన నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో చురుగ్గా లేని ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి ఇప్పటికే అప్రమత్తం చేశారన్నారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరేసేలా 117 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తు, సంగారెడ్డి నియోజకవర్గంపై వస్తున్న ప్రచారానికి జగ్గారెడ్డి గట్టిగా జవాబిచ్చారు. తాను కేవలం సంగారెడ్డి నుంచి పోటీ చేయనని మాత్రమే అన్నానని, అంతేకానీ ఎన్నికల బరి నుంచే తప్పుకుంటానని ఎక్కడా చెప్పలేదన్నారు. భవిష్యత్తులో సంగారెడ్డి స్థానం మహిళలకు కేటాయించినా, లేదా సాధారణ స్థానంగా ఉన్నా సరే.. అక్కడ నుంచి తన అర్ధాంగి నిర్మలనే అభ్యర్థిగా బరిలో ఉంటారని స్పష్టం చేశారు. విపక్షాల విమర్శలు, సర్వేలను చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇదే క్రమంలో సొంత పార్టీ నేతలకు కూడా జగ్గారెడ్డి హితవు పలికారు. గతంలో కేసీఆర్ మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఎమ్మెల్యేల పనితీరుపై ఇలాంటి సర్వేలే వచ్చాయని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఎవరూ ఎప్పటికీ శాశ్వత వీరులు కారని, తామే గొప్ప అనుకుంటే సాగదన్నారు. ముఖ్యమంత్రి హెచ్చరించిన తర్వాత కూడా తీరు మార్చుకోని ప్రజాప్రతినిధులకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలో లేదో ముఖ్యమంత్రి, పార్టీ అధిష్ఠానం మాత్రమే నిర్ణయిస్తారని తేల్చి చెప్పారు.


RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# పాఠశాలలోనే ప్రజాస్వామ్య పాఠం..

## డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో ఆదర్శ నమూనా ఎన్నికలు





దామెర, జూలై 10 హైదరాబాద్ ఎస్టేట్:
రేపటి బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దామెర మండలం ఒగ్లాపూర్ పరిధిలోని డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో నిర్వహించిన నమూనా ఎన్నికలు ఆదర్శప్రాయంగా నిలిచాయి. విద్యా క్యాలెండర్‌లో భాగంగా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ బృందం భారత ఎన్నికల వ్యవస్థను ప్రతిబింబించేలా ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించింది. నామినేషన్ల దాఖలు, ప్రచారం, ఓటింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, విజేతల ప్రమాణ స్వీకారం వరకు ప్రతి దశను వాస్తవ ఎన్నికల మాదిరిగా నిర్వహించడంతో విద్యార్థులు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు విలువ, నాయకత్వ బాధ్యతలు, క్రమశిక్షణ వంటి అంశాలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకున్నారు. సుమారు 850 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని క్రమబద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించారు. స్కూల్ ప్యూపిల్ లీడర్ (బాలుర విభాగం)గా తొర్రూర్ హేమంత్ కేవలం మూడు ఓట్ల తేడాతో విజయం సాధించగా, బాలికల విభాగంలో బుద్దె శ్రీహర్ష 80 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందింది. డిప్యూటీ స్కూల్ ప్యూపిల్ లీడర్ (బాలుర విభాగం)గా అజ్మీర సిద్ధార్థ 147 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించగా, బాలికల విభాగంలో అలుగోజు అద్వీత 24 ఓట్ల తేడాతో గెలుపొందింది. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం కనులపండువగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థులు బాధ్యతాయుత నాయకత్వంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని యాజమాన్యం ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, కరస్పాండెంట్ బి. శోభారాణి, డైరెక్టర్లు డి. రాకేష్ భాను, డి. దినేష్ చందర్, డాక్టర్ బి. పవన్, టీజీబీ బ్యాంక్ మేనేజర్ భానుచందర్, కావ్య, మీనా తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు రతన్ సింగ్, రాజ్‌కుమార్, పాషా, నరేష్‌కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్య విలువలను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా ఆచరణలో విద్యార్థులకు అనుభవపూర్వకంగా పరిచయం చేసిన ఈ నమూనా ఎన్నికలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత పౌరస్ఫూర్తిని పెంపొందించిన ఆదర్శ కార్యక్రమంగా నిలిచాయి.

# ప్రతి అర్హ ఓటరు ఓటు నమోదు చేసుకోవాలి

## : కనుకుంట్ల రంజిత్ కుమార్




వరంగల్, జులై 11 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొనసాగుతోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు, వరంగల్ జిల్లా నాయకుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు)తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికీ ఓటు నమోదు చేసుకోని వారు, ఓటరు వివరాల్లో మార్పులు, చేర్పులు లేదా సవరణలు అవసరమైన వారు వెంటనే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా నమోదు, సవరణల ప్రక్రియను పూర్తి చేసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కనుకుంట్ల రంజిత్ కుమార్ కోరారు.

# యూత్ కాంగ్రెస్‌కు కొత్త ఊపు..

## ఇద్దరు డివిజన్ అధ్యక్షుల నియామకం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 11:-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్ రెడ్డి అధ్యక్షతన పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పలు కీలక నియామకాలు చేపట్టారు. పార్టీ ఆదేశాల మేరకు కొంగరకలాన్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నీళ్ల మహేశ్వర్ గౌడ్, కుంట్లూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎరుకల సాయి కుమార్ గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఇద్దరు నూతన అధ్యక్షులతో పాటు వారి కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించి, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువై పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందిస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు.

---

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి నల్గొండ
మున్సిపాలిటీని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసినందున, అందులో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి అద్దె అలవెన్స్ (HRA) మరియు సిటీ కాంపెన్సేటరీ అలవెన్స్ (జజూా) పొడిగిస్తూ నల్గొండ జిల్లా కలెక్టర్ శ్రీ బి. చంద్రశేఖర్, ×ూూా గారు ఉత్తర్వులు జారీ చేశారు.

ముఖ్యమైన నిర్ణయాలు & నిబంధనలు:
HRA (ఇంటి అద్దె అలవెన్స్): నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే అర్హులైన రెగ్యులర్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ వారి ప్రాథమిక వేతనం (Basic Pay) లో 17% HRA పొందేందుకు అనుమతి లభించింది. CCA (సిటీ కాంపెన్సేటరీ అలవెన్స్): పెంచిన ఎ=ూాతో పాటు, అర్హులైన ఉద్యోగులందరూ ఆర్థిక శాఖ (G.O.Ms.No.54) నిబంధనల ప్రకారం సవరించిన రేట్లలో జజూా పొందడానికి కూడా అర్హులు. అమల్లోకి వచ్చే తేదీ: ఈ సవరించిన HRA మరియు జజూా అలవెన్సులు 13.01.2026 నుండి అమలులోకి వస్తాయి (కార్పొరేషన్ జీవో వచ్చిన తేదీ నుండి). ఎరియర్స్ (బకాయిలు): 13.01.2026 నుండి రావాల్సిన బకాయిలతో (Arrears) కలిపి ఈ అలవెన్సులను చెల్లించాలని, ఉద్యోగుల అర్హతను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ట్రెజరీ అధికారి (DTO), PAO మరియు డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులను (DDOs) ఆదేశించారు.
రికవరీ నిబంధన: ఒకవేళ పొరపాటున (Incorrect Fixation వల్ల) ఉద్యోగులకు అదనంగా ఏవైనా నిధులు చెల్లిస్తే, వాటిని తిరిగి రికవరీ చేయడం జరుగుతుంది.

# టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో...

# 27న తెలంగాణ జర్నలిస్టుల "ఛలో పార్లమెంట్"

# – జంతర్ మంతర్ లో ఒకరోజు ధర్నా



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్ బి నగర్ 11
: కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, ఈ నెల 27వ తేదీన "తెలంగాణ జర్నలిస్టుల ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల డిమాండ్ల సాధనకై ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు వారు శనివారం నాడిక్కడ మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, జర్నలిస్టుల రక్షణ చట్టం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు తదితర డిమాండ్ల పై 27న ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద (జంతర్ మంతర్ లో) ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ధర్నా అనంతరం
పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన స్కీం ను కేంద్ర ప్రభుత్వం గత కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్దరించలేదని, దీంతో జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసుల సదుపాయాన్ని పునరుద్దరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్"ను ఏర్పాటు చేయాలని కోరారు. రిటైర్డ్ జర్నలిస్టులకు కొన్ని రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేదని, దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులను నిలువరించేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు పూర్తి స్థాయిలో చట్టబద్దత కల్పించాలని అన్నారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# రాజ్‌కుమార్ కోసం గాలింపు ముమ్మరం..

## సమాచారం ఇస్తే నగదు బహుమతి

## నిందితుడి ఆచూకీకి రూ.2 లక్షల బహుమతి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 11:-
ఆరుగురు హత్యల కేసులో పరారీలో ఉన్న నిందితుడు పి. రాజ్‌కుమార్‌ను పట్టుకునేందుకు విశ్వసనీయ సమాచారం అందించిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతి అందజేస్తామని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రకటించింది. నిందితుడి ఆచూకీ తెలిపి అతని అరెస్టుకు సహకరించే సమాచారాన్ని అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు వారి భద్రతకు పూర్తి హామీ ఉంటుందని పోలీసులు వెల్లడించారు. నిందితుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు చేవెళ్ల పోలీస్ కంట్రోల్ రూమ్ 8712665324 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో నిందితుడిని త్వరగా అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తెలిపారు.

# గీసుగొండకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

## ఉప సర్పంచ్ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా కోట ప్రమోద్ ఏకగ్రీవ ఎన్నిక





గీసుగొండ, జులై 11 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తిక్ ఆదేశాల మేరకు గీసుగొండ మండల ఉప సర్పంచ్ల ఫోరం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు దండా నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడతలపాటి ఆనంద్, దుగ్గొండి మండల అధ్యక్షుడు తొర్రరు రవి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో గీసుగొండ మండలానికి చెందిన కోట ప్రమోద్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర స్థాయి కీలక బాధ్యతకు ఏకగ్రీవంగా ఎంపిక కావడం ఆయన నాయకత్వంపై ఉప సర్పంచ్లు ఉంచిన విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. ఈ ఎన్నికతో గీసుగొండ మండలానికి రాష్ట్ర స్థాయిలో మరింత గుర్తింపు లభించిందని ఉప సర్పంచ్లు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అదే సమావేశంలో నల్ల సురేష్ బాబు జిల్లా కార్యదర్శిగా, జన్ను సుధాకర్ గీసుగొండ మండల అధ్యక్షుడిగా, మెడిద ప్రశాంత్ ప్రధాన కార్యదర్శిగా, కుప్పల శ్రీను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, బాల థెరిసా, ఆలేటి అనూష ఉపాధ్యక్షులుగా, పీసాల రాజేశ్వర్ రావు అధికార ప్రతినిధిగా, బిట్ల శివప్రసాద్ కోశాధికారిగా, ఎంబడి సామ్రాజ్యం, భూక్యా నీలా, తిప్పరపు శ్రీనివాస్, బట్టమేకల శివ కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దండా నరేష్ మాట్లాడుతూ ఉప సర్పంచులు తమ హక్కుల సాధనలో ఐక్యంగా ముందుకు సాగడంతో పాటు గ్రామాభివృద్ధిలో మరింత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల మధ్య సమన్వయంతో ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శి కోట ప్రమోద్, జిల్లా కార్యదర్శి నల్ల సురేష్ బాబు, మండల కమిటీ సభ్యులను ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నూతన కమిటీకి అభినందనలు తెలియజేస్తూ విజయవంతమైన పదవీకాలాన్ని ఆకాంక్షించారు.

RNI No Tel / 2012 /4241

హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

hyderabadestate.co.in

12 ఆదివారం జూలై 2026

## రాజకీయాలు కాదు నాకు ప్రజలే ముఖ్యం..

### ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్

మూసి పునర్జీవనానికి తాము వ్యతిరేకం కాదని. కానీ పేదల ఇండ్లను కూల్చడం సరైనది కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు మూసి ప్రక్షాళన ముసి పునర్జీవంకు ఎవరం వ్యతిరేకులం కాదని మూసిలో చేపలు పట్టేలా అందులో ఈతలు కొట్టే పరిస్థితులు రావాలని కోరుకుంటున్నామని. మల్కాజ్గిరి ఎంపీ ఇటల రాజేందర్ అన్నారు అయితే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్స్ ఇవ్వడానికే నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం మూసి పేరుతో లక్షల కోట్లు ఎక్కడినుంచి తెస్తారని ప్రశ్నించారు. ఇవాళ లకిడికాపూల్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడిన ఈటల. మూసి అనగానే చాలామంది ప్రభుత్వ భూముల్లో ఇండ్లు కట్టుకున్నారేమో అనుకుంటున్నారని ఇది తప్పు అన్నాడు. నదులకు ఎక్కడ బహర్ జోన్లు ఎస్టిఎల్లో ఉండమన్నారు. నదులన్నీ ప్రైవేట్ భూముల్లోనే ఉంటాయన్నారు. నదులు ప్రవహిస్తూ ప్రైవేట్ భూముల గుండా వెళ్తాయన్నార. నదికి ప్రభుత్వ భూమి అని చెప్పెందుకు ఎక్కడ ఆధారాలు ఉండవు అన్నారు. కాకపోతే నది నాలా అని మాత్రమే మార్క చేస్తారన్నారు. అంతే తప్ప నదులను ఆక్రమించుకున్నారని ఆరోపణలు చేయడం శుద్ధ తప్పు అన్నారు. హైదరాబాదులోని అనేక బస్తీల్లో మూసి పరివాహన ప్రాంతంలో ఉంటున్న పేదలు ఒక తరం పూర్తిగా కష్టపడ్డాక రెండో తరం వేసుకున్న రేకుల షెడ్డులు కూల్చడం ఏంటి అని ప్రశ్నించారు.

## వియత్నాం దుర్ఘటనపై కాంగ్రెస్ నేత కేఎల్ఆర్ దిగ్భ్రాంతి





( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 11:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..వియత్నాం బోటు ప్రమాదంలో 15 మంది తెలుగు టూరిస్టులు దుర్మరణం చెందటంపై కాంగ్రెస్ నేత, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఉన్నతాధికారులు వియత్నాం ఎంబసీ సహా అక్కడ టూరిస్టులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నారని కేఎల్ఆర్ చెప్పారు.ఆనందం, సంతోషంగా విదేశీ పర్యటనకు వెళ్లిన భారతీయుల కుటుంబాల్లో ఈ ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపిందని కిచ్చెన్న ఆవేదన వ్యక్తం చేశారు.త్వరగా అక్కడ నుంచి తెలంగాణకు చెందిన 40 మంది టూరిస్టులను స్వరాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు లక్ష్మారెడ్డి.(వియత్నాంలో ఉన్న తెలుగు రాష్ట్రాల టూరిస్టులు సహా తెలంగాణ అధికారులతో కేఎల్ఆర్ ఫోన్లో మాట్లాడారు)

## పారదర్శక పాలనకు కాంగ్రెస్ పెద్దపీట: కేఎల్ఆర్

### లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా సీఎంఆర్ఫ్ , కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన కేఎల్ఆర్





( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 11:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పాలనలో పారదర్శకతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇప్పటికే సీఎంర్ఫ్ , ఎల్ఓసి చెక్కులను రోగులకు అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి సర్కార్.. భవిష్యత్ లో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులకు బదులుగా లబ్దిదారుల ఖాతాల్లోనే నేరుగా డబ్బును బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుందని కేఎల్ఆర్ తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులను ఆపార్టీ నేతలు దుర్వినియోగం చేయటం, అవినీతి పాల్పడటం తెలిసిందే.అందుకే ప్రజాపాలనలో అవినీతి లేకుండా... ప్రభుత్వ సేవలు అందించేలా నేరుగా లబ్ధిదారులకే నగదు అందేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని శాఖాల్లో చర్యలు చేపట్టిందని లక్ష్మారెడ్డి చెప్పారు.అవినీతి అనకొండల భరతం పడుతున్న ప్రభుత్వం: కేఎల్ఆర్పలు శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులను గుర్తించి ఏసీబీ రైడ్స్ చేసి పట్టుకుంటుంది తెలంగాణ ప్రభుత్వం.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక... సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అనేక మంది అవినీతి అధికారులను పట్టుకుని ఆస్తులను జప్తు చేసిందని కిచ్చెన్నగారు గుర్తు చేశారు. ప్రజాపాలనలో నిజాయతీ, నిబద్ధత, పారదర్శకతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేఎల్ఆర్ గుర్తు చేశారు. ఏశాఖలోనైనా అవినీతి అధికారులను పట్టిస్తే... రూ. లక్ష బహుమతి ఇస్తానని గతంలోనే లక్ష్మారెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు.

## చాకచక్యంతో చోరీ కేసు ఛేదించిన గీసుగొండ పోలీసులు

### జాన్పాక సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా నిందితుడి అదుపు బంగారు ఉంగరం, వెండి కాళ్లపట్టీలు స్వాధీనం




గీసుగొండ, జులై 11 హైదరాబాద్ ఎస్టేట్:

వరంగల్ జిల్లా గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కేసును విజయవంతంగా ఛేదించారు. గీసుగొండ మండలం జాన్పాక గ్రామ సమీపంలో జూలై 10న సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని గమనించారు. పోలీసు వాహనాన్ని చూసిన వెంటనే అతడు సమీపంలోని ట్రాన్స్ఫార్మర్ వెనుక దాక్కోవడానికి ప్రయత్నించడంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతడు నందిపాటి జార్జ్ అలియాస్ రమణయ్య (64)గా గుర్తించారు. నెల్లూరు జిల్లా కొండాపురం మండలం పుట్టిపల్లి గ్రామానికి చెందిన అతడు, వరంగల్ నగరంలోని ఆదర్శ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకుని అర్ధరాత్రి సమయంలో తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించినట్లు అంగీకరించాడు. అనంతరం బీరువాలో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసినట్లు విచారణలో వెల్లడించాడు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ నేరానికి పాల్పడినట్లు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు ఒక గ్రాము బంగారు ఉంగరం, సుమారు 50 గ్రాముల వెండి కాళ్లపట్టీలు (ఒక జత)ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు గీసుగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు. గస్తీ విధులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులపై నిఘా కొనసాగించడం వల్లే ఈ కేసును వేగంగా ఛేదించగలిగినట్లు పోలీసులు తెలిపారు.

## కల్వకోల్ స్వతంత్ర సర్పంచ్ బక్కని లక్ష్మమ్మకు ఎం.ఆర్.పి.ఎస్ ఘన సన్మానం





హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 11

మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామపంచాయతీకి స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్గా ఎన్నికైన బక్కని లక్ష్మమ్మను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బక్కని లక్ష్మమ్మతో పాటు ఆమె కుమారుడు, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా నాయకుడు, మహేశ్వరం మండల ఇన్చార్జి బక్కని రవి మాదిగలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ,బక్కని లక్ష్మమ్మ గత 20 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికురాలిగా గ్రామ ప్రజలకు సేవలందించారని,ఆమె సేవలను గుర్తించిన గ్రామ ప్రజలు సర్పంచ్గా ఎన్నుకోవడం ప్రజాసేవకు లభించిన గౌరవమని అన్నారు.అలాగే బక్కని రవి మాదిగ గత రెండు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో చురుకుగా పనిచేస్తూ సామాజిక న్యాయం,ఎస్సీ వర్గాల హక్కులు,ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేశారని కొనియాడారు.ఉద్యమంలో భాగంగా దీక్షలు,ధర్నాలు,రాస్తారోకోలు,నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని,కుటుంబ సమస్యల నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకు ప్రజలకు అండగా నిలిచి సేవలు అందించారని పేర్కొన్నారు.ఉద్యమంలో చేసిన సేవలకు గుర్తింపుగానే గ్రామ ప్రజలు ఈ విజయాన్ని అందించారని అన్నారు.ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఎదుర్కొంటూ,అనేక రాజకీయ సవాళ్లను అధిగమించి స్వతంత్ర అభ్యర్థిగా బక్కని లక్ష్మమ్మను గెలిపించడం సాధారణ విషయం కాదని,ఇది గ్రామ ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.గ్రామపంచాయతీ కార్యాలయం వెలుపల నిలిచే స్థాయి నుంచి అదే కార్యాలయంలో ప్రజాప్రతినిధిగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఒక పారిశుద్ధ్య కార్మికురాలు ఎదగడం సామాజిక మార్పుకు ప్రతీకగా నిలిచిందని అన్నారు.ఈ విజయం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి దక్కిన గౌరవమని,ఉద్యమ కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చే సంఘటనగా అభివర్ణించారు.బక్కని లక్ష్మమ్మ సర్పంచ్గా గ్రామాభివృద్ధి,పారదర్శక పాలన,ప్రజా సంక్షేమానికి కృషి చేసి గ్రామ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.అలాగే బక్కని రవి మాదిగ రాజకీయ ప్రస్థానం ప్రజల ఆశీర్వాదంతో మరింత ఉన్నత స్థాయికి చేరాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహా మాదిగ,పి.శ్రీనివాస్ మాదిగ,గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్దే ధ్యేయం...

## ముందుచూపుతోనే ప్రణాళికలు

- 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం,
- గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు,
- పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ
- గంగాదేవిపల్లిలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద కీలక సూచనలు



గీసుగొండ, జులై 11 హైదరాబాద్ ఎస్టేట్:

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు ప్రణాళికలతో వాటిని నివారించడమే సమర్థ పాలనకు నిదర్శనమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శనివారం గీసుగొండ మండలం గంగాదేవిపల్లిలోని శిక్షణా కేంద్రంలో గీసుగొండ, సంగెం మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల పదవీకాలాన్ని గ్రామాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తూ పనిచేయాలని, 16వ ఆర్థిక సంఘం నిధులను తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొంటూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా మిగలకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడంతో పాటు ప్రతి గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, జిల్లాలో సాధారణంతో పోలిస్తే వర్షపాతం గణనీయంగా తగ్గిందని తెలిపారు. రాబోయే ఆరు నెలలకు అవసరమైన తాగునీటి కార్యాచరణ ప్రణాళికలను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని, సమస్యలు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడమే నిజమైన ప్రణాళిక అని స్పష్టం చేశారు. జూలై 15 నాటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదుకాకపోతే రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గత ఏడాది జలశక్తి అభియాన్ కింద జిల్లాలో 72 వేల నీటి సంరక్షణ నిర్మాణాలను పూర్తి చేసి జియో ట్యాగింగ్ విజయవంతంగా చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.4 కోట్ల ప్రోత్సాహక నిధులు లభించాయని కలెక్టర్ తెలిపారు. ఈ విజయంతో వరంగల్ జిల్లా దేశంలోని ఉత్తమ 50 జిల్లాల్లో స్థానం సంపాదించిందని పేర్కొంటూ, ఈ ఏడాది 52 వేల నిర్మాణాల లక్ష్యాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నిధులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, గ్రామ పంచాయతీ తీర్మానాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలని, నిధుల లభ్యత లేకుండా పనులు ప్రారంభించరాదని సూచించారు.

### వినూత్న ప్రదర్శన స్టాళ్లు ఆకట్టుకున్నాయి

కార్యక్రమం సందర్భంగా గీసుగొండ మండల పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేసిన వినూత్న ప్రదర్శన స్టాళ్లను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించి అభినందించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత టైర్లు, ఖాళీ సీసాలతో రూపొందించిన వినియోగ వస్తువులు, పైపు కంపోస్ట్ యూనిట్లు, స్టీల్ బ్యాంక్, గంగాదేవిపల్లిలో తయారైన సేంద్రీయ ఎరువుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన, సీఈవో రాం రెడ్డి, డీఆర్డీఓ నాగ పద్మజ, ఆర్డీఓ సుమ, డీఎల్పీఓ వేదవతి, తహసీల్దార్ మహమ్మద్ రియాజుద్దీన్, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వ్యవసాయ, అటవీ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వరంగల్ చౌరస్తాలో బండి సంజయ్ జన్మదిన వేడుకలు ఘనంగా

### మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ



వరంగల్, జులై 11 హైదరాబాద్ ఎస్టేట్:
భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను శనివారం వరంగల్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శివనగర్ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, రాష్ట్ర నాయకుడు గందే నవీన్, బీజేపీ నాయకుడు కనుకుంట్ల రంజిత్ కుమార్తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంకితభావం, కృషి, ప్రజా సమస్యలపై పోరాటంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఎదిగిన బండి సంజయ్ కుమార్ ప్రస్థానం పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణలో పార్టీ విస్తరణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొంటూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీజేవైఎం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సుఖమా? చదువా?

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్
ఈ ఎనిమిదింటిని వదిలేస్తేనే సక్సెస్!
క్లాస్ రూమ్ లో ఒకే బెంచ్ పై కూర్చుని ఒకరు టాపర్ అవుతుంటే ఇంకొకరు ఎందుకు ఫెయిల్ అవుతున్నారు? కేవలం వారి చదువులో లేదు వారు అనుభవించే సుఖాల్లో ఉంది చీకటి వెలుతురు ఎలాగైతే ఒకే చోట ఉండలేవో సుఖం చదువు కూడా ఒకే చోట ఉండవు !
సుఖాన్ని కోరుకునే వాడు విద్యను వదిలేయాలి విద్యను కోరుకునే వాడు సుఖాన్ని వదిలేయాలి!
వెలుతురు అంటే తేజస్సు, తిమిరం అంటే చీకటి ఎలాగైతే కలిసి ఉండలేవో విద్య సుఖం కూడా కలిసి ఉండవు. అందుకే విద్యార్థి అయిన వాడు ఈ 8 అవ లక్షణాలను కచ్చితంగా వదిలి పెట్టాలి.



" సుఖార్థీ చ త్య జేద్ విద్యాం
విద్యార్థీ చ త్య జే త్సు ఖమ్
న విద్యా సుఖయోా సందీస్ తేజస్ తిమిరయో రివ"
" కామం క్రోధం తదా లోభం స్వాదం
శృంగార కౌతుకే
అతి నిద్రతిసేవే చ విద్యార్థీ హ్య ష్ట వర్జయేత్ "

1. కామం ( కోరికలు/ వ్యామోహం)
2. క్రోధం ( కోపం )
3. లోభం ( పిసినారితనం / అత్యాశ )
4. స్వాదం ( రుచికరమైన తిండి పైనే ధ్యాస )
5. శృంగార ( అలంకరణ/ ఆడంబరాలు )
6. కౌతుకే ( అతి సరదాలు/ టైం వేస్ట్ ఆటలు )
7. అతినిద్ర ( ఎక్కువగా పడుకోవడం )
8. అతిసేవ ( ఇతరుల చేత పనులు చేయించుకుంటూ బద్ధకంగా ఉండటం ).

ఈ 8 అవలక్షణాలు విద్యార్థులు చెడిపోవడానికి కారణం అవుతున్నాయి.
ఫోన్ అడిక్షన్ మరియు రీల్స్ ( కౌతుకే / అతినిద్ర )
రాత్రిళ్ళు గంటలు తరబడి రీల్స్, వెబ్ సిరీస్ చూస్తూ టైం వేస్ట్ చేయడం ఆ తరువాత ఉదయాన్నే లేవలేక కాలేజీకి/స్కూల్ కు బద్ధకంగా వెళ్లడం,,ఈరోజుల్లో అతినిద్రకు సరదాలకు కారణం స్మార్ట్ ఫోన్ !!
లుక్స్ ఇన్ఫ్లుయెన్సర్ కల్చర్...
చదువు పక్కన పెట్టి ఏ బట్టలు వేసుకోవాలి ఎలా రెడీ అవ్వాలి ఇన్స్టాలో ఎలాంటి ఫోటోలు పెట్టాలి అనే ఆడంబరాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు!
ఇన్స్టంట్ గ్రాటిఫికేషన్ ( కామం / స్వాదం )
ప్రతిదీ వెంటనే అయిపోవాలి ! నచ్చిన ఫుడ్ తింటూ ఎంజాయ్ చేయాలి అనే మైండ్ సెట్, కష్టపడి చదవడం కంటే ఈజీగా వచ్చే సుఖాలకే స్టూడెంట్స్ లొంగిపోతున్నారు !!
ఎమోషనల్ ఇన్ బాలన్స్ ( క్రోధం )
అంటే చిన్న చిన్న విషయాలకే కోపపడం, ఇగో ఫీల్ అవ్వడం వల్ల చదువుపై పెట్టాల్సిన కాన్సన్ట్రేషన్ దెబ్బతింటుంది. దీని బాటమ్ లైన్ ఏమిటంటే...
నో పెయిన్ నో గేయిన్....
ఇప్పుడు కాస్త కష్టపడి సుఖాలను త్యాగం చేస్తే భవిష్యత్తులో లైఫ్ అంతా సుఖంగా ఉంటుంది. అలాకాకుండా ఇప్పుడే అన్నీ సుఖాలు కావాలి అనుకుంటే లైఫ్ లో సెటిల్ అవడం చాలా కష్టం అవుతుంది. ఛాయిస్ మీదే !!!

దుర్గం వివేక్ ప్రేమ్ రత్నం
సబ్ ఎడిటర్.

# టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి

### – మహేశ్వరం నియోజకవర్గంలో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్)' కార్యక్రమంపై వివరణ

### – అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు


( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 11:)
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంపై టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగాకలిసిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుడటిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ పరంగా చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమ ప్రగతిని, క్షేత్రస్థాయిలో సాధించిన విజయాలను బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి దేప భాస్కర్ రెడ్డి కూలంకషంగా వివరించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం అత్యంత విజయవంతంగా, చాలా అద్భుతంగా నిర్వహించబడింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలోని తప్పులను సరిదిద్దేలా మా శ్రేణులు అంకితభావంతో పనిచేశాయి."మహేశ్వరం నియోజకవర్గంలో ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఇంత బాధ్యతాయుతంగా, విజయవంతంగా ముందుకు తీసుకెళ్లినందుకు గాను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేఎల్ఆర్ ని ఽ బూత్ ఇన్‌ఛార్జ్‌లను బీఎల్ఏలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులను టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి, ప్రజా పక్షపాత కార్యక్రమాలకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి: డీసీపీ నారాయణరెడ్డి

### పెండింగ్ కేసులపై వేగం పెంచాలి.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 11:-
మహేశ్వరం జోన్‌లో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాలని మహేశ్వరం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణరెడ్డి, ఐపీఎస్ సూచించారు. జోన్ పరిధిలోని సహాయ పోలీసు కమిషనర్లు, స్టేషన్ హౌస్ అధికారులు, దర్యాప్తు అధికారులతో నిర్వహించిన నేరాల సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.
సమావేశంలో 2024కు ముందు నమోదైన పెండింగ్ అనుమానాస్పద మృతి కేసులు, తీవ్రమైన నేరాలు, పోక్సో, మాదకద్రవ్యాల నిరోధక చట్టం, ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం, ఆస్తి సంబంధిత నేరాలు, రోడ్డు ప్రమాదాలు, హిట్ అండ్ రన్ కేసులు, మిస్సింగ్ కేసులు, సైబర్ నేరాలు, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్లు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, చట్ట అమలు చర్యలు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, పోలీసుల పనితీరుపై సమగ్రంగా సమీక్షించారు.
జాతీయ రహదారి--765, రాష్ట్ర రహదారి--19పై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంపై తనిఖీలు, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక డ్రైవ్‌లు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.
పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందించేందుకు అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు కనిపించేలా, అందుబాటులో ఉండాలని డీసీపీ నారాయణరెడ్డి స్పష్టం చేశారు.



# జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్
ఆసిఫాబాద్, జూలై 11:రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గిరిజన సంక్షేమం, పేదల గృహ నిర్మాణం వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు అన్నారు. శనివారం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ, వాంకిడి మండలం కోమటిగూడ గ్రామాలలో 20 లక్షల రూపాయల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించడం జరిగిందని, ఈ భవనాల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామపంచాయతీలు గ్రామాల అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారాలని, ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించడం జరిగిందని, మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలతో పాటు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.
కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన పోడు రైతులు తాతముత్తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, సాగు భూములలోకి వెళ్లకుండా పోలీసుల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకురాగా స్పందిస్తూ 2005 సంవత్సరానికి ముందు నుంచి సాగు చేస్తున్న పాత పోడు భూముల విషయంలో రైతులను ఎట్టి పరిస్థితులలోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులకు సూచించారు. అదే సమయంలో కొత్తగా అటవీ భూములను ఆక్రమిస్తూ పోడు సాగు చేయకూడదని, పోడు భూములకు సంబంధించిన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని చట్టాలకు సంబంధించినదని, గిరిజనేతర రైతుల సంబంధిత సమస్యలపై అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుర్దాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, చట్టపరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగుకు అనుకూలమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూములు, ఆస్తులు శాశ్వతం కావని, పిల్లలే మనకు నిజమైన ఆస్తిఅని, వారిని బాగా చదివించి ఉన్నత స్థానాలలో నిలబెట్టడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు.జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, మహిళల సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో విశేష ప్రగతి.. బీఎల్‌వో నిర్మలకు ఘన సన్మానం

గ్రేటర్ వరంగల్, జులై 11 హైదరాబాద్ ఎస్టేట్:
ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరిచిన గొర్రెకుంట గ్రామం 141వ పోలింగ్ బూత్ బీఎల్‌వో శ్రీమతి జన్ను నిర్మల--నర్సయ్యకు ఘన సన్మానం లభించింది. బూత్ పరిధిలో 55 శాతం ఎన్యూమరేషన్ పత్రాలను విజయవంతంగా స్వీకరించి లక్ష్యసాధనలో ముందంజలో నిలవడంతో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ల్యాదెల్ల సంపత్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో బీఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ విశేష పురోగతి సాధించిన నిర్మల సేవలు అభినందనీయమని, ఇటువంటి అధికారులు ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆర్బి సాంబయ్య, జీపీఓ జ్యోతి రెడ్డి, మాజీ సర్పంచ్ జన్ను రేణుక, బీఎల్‌వోలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నిర్మలను అభినందించారు. ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచే ఓటరు జాబితా రూపకల్పనలో అంకితభావంతో పనిచేస్తున్న బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పేర్కొంటూ, ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాలని నాయకులు పిలుపునిచ్చారు.




# ప్రజా సమస్యల వినతులు స్వీకరిస్తున్న... భీమరశెట్టి రాంకీ

స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల మరియు కూటమి కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతులను, సమస్యలను అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ స్వీకరించారు. వచ్చిన వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు మరియు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
12 ఆదివారం జూలై 2026

## రామ్‌కీ ఫార్మా సిటీలో 767 కిలోల గంజాయి, హషీష్ ఆయిల్ దగ్ధం..





మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశే లక్ష్యంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో , రాష్ట్ర ప్రభుత్వ 'ఈగల్' వింగ్ సంయుక్తంగా భారీ స్థాయిలో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు వేర్వేరు కేసుల్లో ఎన్సీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న సుమారు 767.5 కిలోల గంజాయిని, 4.036 లీటర్ల హషీష్ ఆయిల్‌ను శుక్రవారం నాడు శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు.పరవాడ మండలం, తానం గ్రామంలోని 'రామ్‌కీ ఫార్మా' కంపెనీకి చెందిన అత్యాధునిక ఇన్సినరేషన్ ప్లాంట్‌లో కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ, బహిరంగంగా కాల్చకుండా మెషీన్ ద్వారా ఈ డ్రగ్స్‌ను నిర్వీర్యం చేశారు.ఈగల్ ఎస్పీ జి.స్వరూప రాణి, ఎన్ సి బి జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేదిల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియ ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎన్ సి బి సూపరింటెండెంట్ రాజన్ కుమార్, ఇంటెలిజెన్స్ ఆఫీసర్ కె.కిరణ్ బాబు, ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్లు జి.దేముళ్ళు, డాక్టర్ కల్యాణి మరియు అనకాపల్లి ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.
యువతను వ్యసనాల బారి నుండి కాపాడేందుకు, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. భవిష్యత్తులోనూ ఇలాంటి తనిఖీలు, నిర్మూలన చర్యలు నిరంతరం కొనసాగుతాయి. పట్టుబడిన మత్తు పదార్థాలను ఎప్పటికప్పుడు కోర్టు అనుమతితో ఇలాగే ధ్వంసం చేస్తాం" అని అధికారులు స్పష్టం చేశారు.

## బండి సంజయ్ జన్మదిన వేడుకలు ఘనం



గీసుగొండ, జులై 11 హైదరాబాద్ ఎస్టేట్:
కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గీసుగొండ మండలం మచ్చాపూర్ సెంటర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. చొక్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో దేశాభివృద్ధి, తెలంగాణ అభ్యున్నతికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు నిమ్మగడ్డ జాన్ విక్రమ్, మండల ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సల్ల సాంబరాజు, మండల ఉపాధ్యక్షులు తుమ్మనపల్లి శంకర్రావు, బొత్స సదానందం, కోశాధికారి తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కామణి భాస్కర్, వార్డు సభ్యుడు బాదావత్ రమేష్ నాయక్, సీనియర్ నాయకులు ఏడాకుల రాజిరెడ్డి, మాడిశెట్టి రాము, గడ్డమీద బాలరాజు, గట్ల బిక్షపతి, రసుధ రెడ్డి, పరకాల జనసేన ఇన్‌చార్జి రమేష్ యాదవ్, నారాయణరెడ్డి, కమలాకర్, తుమ్మనపల్లి రాజు, కన్నె నాగరాజ్, కృష్ణారావు, తిప్పారపు ప్రశాంత్, తిప్పారపు అజయ్, తిప్పారపు వినయ్, దూడల శ్రీకాంత్, ప్రణయ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల



ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు.తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు.స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కవితకు టీవీల్లో కనిపించాలనే పిచ్చి: గండ్ర వెంకటరమణా రెడ్డి



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కవిత తీవ్ర నిరాశ, నిస్పృహలతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం టీవీల్లో, మీడియాలో కనిపించాలనే పిచ్చితోనే ఆమె ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఎంతో మంది యువకులు, ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోవడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని గండ్ర గుర్తుచేశారు. నాడు, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ప్రశ్నించకుండా కవిత కేవలం బీఆర్ఎస్ పార్టీని మాత్రమే టార్గెట్ చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని నిలదీశారు. అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ సర్కార్ నుంచి న్యాయం జరగాలని ఆమె ఎందుకు గళం విప్పడం లేదని ఆక్షేపించారు.కాంగ్రెస్ వైఫల్యాలను వదిలేసి, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించడం చూస్తుంటే కాంగ్రెస్, తెలంగాణ రక్షణ సేనల మధ్య ఏదో రహస్య మిత్రత్వం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయని గండ్ర సంచలన ఆరోపణలు చేశారు. అధికార పార్టీతో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని కవిత ఇలా ఏకపక్షంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## ప్రజా సమస్యల వినతుల స్వీకరిస్తున్న...

### బీజేపీ జనతా వారధిలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావుకు



అనకాపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ జనతా వారధి కార్యక్రమంలో పరవాడ మండలం పెదముసిలివాడ గ్రామ ప్రజల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.పరవాడ మండల బీజేపీ అధ్యక్షుడు పిల్లా సతీష్, మండల ప్రధాన కార్యదర్శి బంతిపూడి గోవిందరాజులు పెదముసిలివాడ గ్రామంలో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు, గ్రామానికి సమీపంలోని సముద్ర తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరుతూ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ, పెదముసిలివాడ గ్రామ తాగునీటి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే సమీప సముద్ర తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గల్లా రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు దాడి వీరునాయుడు, కె. పవన్ తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం: మహేశ్ గౌడ్



హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు.పదేళ్లు అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు.
నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

## నేరుగా సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తున్న....

### అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు





జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, పోలీస్ సిబ్బంది సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన వినూత్న వేదిక ఎస్పీ సంపర్క్ ఫోన్-ఇన్ కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో విజయవంతంగా జరిగింది. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు స్వయంగా ఫోన్ లైన్ ద్వారా క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యలను ఆలకించారు.జిల్లావ్యాప్తంగా ఉన్న సిబ్బంది 93469 12011 నంబర్ ద్వారా అదనపు ఎస్పీతో నేరుగా మాట్లాడారు. బదిలీలు, పోస్టింగ్స్, సెలవులు, సర్వీస్ మరియు కుటుంబ ఆరోగ్య సమస్యలను అధికారులు దృష్టికి తెచ్చారు.వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను అదనపు ఎస్పీ ఆదేశించారు. ప్రతి సమస్యను అత్యంత గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం ప్రతి శుక్రవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జరుగుతుంది. వచ్చే ప్రతి ఫిర్యాదును డిజిటల్ రిజిస్టర్‌లో నమోదు చేసి, పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షిస్తారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఐ ప్రసాద్, ఆఫీస్ సూపరింటెండెంట్ దేవరాజు మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మైలారంలో ఉచిత వైద్య శిబిరం

### – 120 మందికి పైగా రోగులకు పరీక్షలు,



మండలంలోని మైలారం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ నూనె దివ్య తిరుపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థుల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 120 మందికి పైగా హాజరుకాగా, వారందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో ప్రముఖ వైద్య ప్రతినిధి అరికిల్ల సుమన్ (జ.=:గా) ఆధ్వర్యంలో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు రోగులను క్షుణ్ణంగా పరీక్షించారు. బాధితులకు అవసరమైన మెడిసిన్లు, ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి ఇంజక్షన్లు కూడా వేశారు. వర్షాకాలంలో వచ్చే జ్వరాలు, ఇతర అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. గ్రామ ప్రజల చెంతకే ఇలాంటి ఉచిత వైద్య సేవలను తీసుకురావడానికి కృషి చేసిన సర్పంచ్ నూనె దివ్య తిరుపతికి, వైద్య బృందానికి మైలారం గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆర్ త రుణ్, జే అఖిల, ఉప సర్పంచ్ మసికె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
12 ఆదివారం జూలై 2026

## విజయ్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. 'జన నాయగన్' వచ్చేస్తున్నాడు!



తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రం విడుదలకు సంబంధించి నెలకొన్న సందిగ్ధతకు త్వరలోనే తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ ఆలస్యం తర్వాత ఈ సినిమా సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. జులై 24న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఓ కెనడా డిస్ట్రిబ్యూషన్ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది.కెనడాకు చెందిన యార్క్ సినిమాస్ అనే డిస్ట్రిబ్యూషన్ సంస్థ నిన్న 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ పోస్ట్ చేసింది. "ఎట్టకేలకు! మన దళపతి విజయ్ 'జన నాయగన్'తో వెండితెరపై మంటలు పుట్టించడానికి సిద్ధంగా ఉన్నారు. కెనడాలో యార్క్ సినిమాస్ విడుదల చేస్తోంది. జులై 24 నుంచి థియేటర్లలోకి వస్తోంది. టికెట్ల కోసం వేచి ఉండండి" అని పేర్కొంది. చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఈ పోస్ట్‌తో సినిమా విడుదలపై అంచనాలు భారీగా పెరిగాయి.

పూర్తయిన సెన్సార్ ప్రక్రియ

మరోవైపు 'జన నాయగన్' సెన్సార్ ప్రక్రియ దాదాపుగా ముగింపు దశకు చేరుకుందని కోలీవుడ్ వర్గాల సమాచారం. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) సూచించిన మార్పులన్నింటినీ చిత్ర బృందం పూర్తి చేసిందని, శుక్రవారం నాటికి సెన్సార్ సర్టిఫికెట్ కూడా చేతికి అందవచ్చని తెలుస్తోంది. సర్టిఫికెట్ రాగానే నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అధికారికంగా విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని సమాచారం అందించినట్లు చెబుతున్నారు. ఒకవేళ ఏమైనా మార్పులు జరిగితే, ఒకరోజు ముందుగా అంటే జులై 23న కూడా సినిమాను విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఏడు నెలల వివాదాలు.. ఆలస్యం

విజయ్ రాజకీయాల్లోకి రాకముందు నటిస్తున్న చివరి చిత్రంగా ప్రచారం పొందిన 'జన నాయగన్' వాస్తవానికి జనవరి 9న విడుదల కావాల్సి ఉంది. అయితే 2025 డిసెంబర్‌లో సెన్సార్ కోసం పంపినప్పటి నుంచి ఈ సినిమాకు కష్టాలు మొదలయ్యాయి. తొలుత ఎగ్జామినింగ్ కమిటీ కొన్ని మార్పులు సూచించింది. వాటిని సరిచేసి మళ్లీ పంపగా, ఈసారి కమిటీలోని ఓ సభ్యుడు చిత్రంలోని కొన్ని సన్నివేశాలు ప్రజా మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తమిళనాడు ఎన్నికల ముందు సినిమా విడుదలైతే విజయ్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరుతుందని కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ వివాదంపై నిర్మాణ సంస్థ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకుని, రివైజింగ్ కమిటీకి సినిమాను పంపేందుకు అంగీకరించింది. ఈ గందరగోళం మధ్యలోనే ఏప్రిల్‌లో సినిమా హై-డెఫినిషన్ కాపీ ఆన్‌లైన్‌లో లీక్ కావడం పెను సంచలనం సృష్టించింది. ఈ లీక్ వ్యవహారంలో ఓ ఫ్రీలాన్స్ ఎడిటర్ సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పైరసీ వెబ్‌సైట్ల నుంచి తొలగించేలోపే దాదాపు 1.2 కోట్ల మంది ఈ సినిమాను చూశారని ప్రాసిక్యూషన్ ఇటీవల కోర్టుకు తెలిపింది. ఇన్ని అడ్డంకులను దాటుకుని ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 'మైసా' కోసం రష్మిక సాహసం.. అండర్‌వాటర్‌లో భారీ ఫైట్!




ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న తన తదుపరి చిత్రం 'మైసా' కోసం ఒక అరుదైన సాహసాన్ని ప్రదర్శించారు. భారతీయ చలనచిత్ర చరిత్రలో తొలిసారిగా ఒక కథానాయిక నీటి అడుగున భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేయడం విశేషం. ఈ ఉత్కంఠభరిత ఘట్టాన్ని ఎటువంటి డూప్ సహాయం తీసుకోకుండా రష్మిక స్వయంగా పూర్తిచేయడం గమనార్హం.ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక గురువారం సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్‌ను పంచుకున్నారు. "నా కెరీర్‌లో ఇంతకంటే సవాలుతో కూడిన పని ఇప్పటివరకు చేయలేదు. ఈ చిత్రం కోసం మేం ఎంతో శ్రమిస్తున్నాం, ఇదే నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది" అని పేర్కొంటూ స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న ఒక చిత్రాన్ని షేర్ చేశారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 20 గంటల పాటు నీటి అడుగున ఈ హై-ఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించినట్లు చిత్ర బృందం వెల్లడించింది.రవీంద్ర పుల్ల దర్శకత్వంలో 'మైసా' చిత్రం ఒక ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. గిరిజన నేపథ్యంతో సాగే ఈ కథలో రష్మిక ఒక గోండు గిరిజన యువతిగా అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. "భారతీయ యాక్షన్ సినిమాలలో ఇది ఒక నూతన అధ్యాయం" అని చిత్ర నిర్మాణ సంస్థ అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పేర్కొంది. ఈ విశిష్ట పాత్ర కోసం రష్మిక బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా స్టంట్ శిక్షణ కూడా పొందారు.ఈ సినిమా టీజర్ అప్‌డేట్‌ను త్వరలోనే వెల్లడించనున్నట్లు, ఈ ఏడాదే చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

## అఖిల్ 'లెనిన్'.. శ్రీలీల స్థానంలో భాగ్యశ్రీ రావడానికి అసలు కారణం చెప్పిన నిర్మాత నాగవంశీ



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. (జులై 10న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఈ ప్రాజెక్ట్ మొదలైనప్పుడు హీరోయిన్‌గా శ్రీలీలను ప్రకటించి, ఆ తర్వాత ఆమె స్థానంలో భాగ్యశ్రీ బోర్సేను తీసుకోవడంపై అనేక ఊహాగానాలు చెలరేగాయి. ఈ పుకార్లకు చెక్ పెడుతూ, హీరోయిన్ మార్పు వెనుక అసలు కారణాన్ని నిర్మాత నాగవంశీ తాజాగా వెల్లడించారు.ఓ ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. శ్రీలీలను తప్పించడం వెనుక ఎలాంటి వివాదాలు లేవని, కేవలం డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్లే ఈ మార్పు జరిగిందని స్పష్టం చేశారు. "కథకు సంబంధించిన క్రియేటివ్ చర్చల వల్ల మా వైపు నుంచే కొంత ఆలస్యం జరిగింది. మేము షూటింగ్ ప్లాన్ చేసుకునే సమయానికి శ్రీలీల ఇచ్చిన డేట్స్ అందుబాటులో లేవు. ఆ తర్వాత ఆమెకు కార్తీక్ ఆర్యన్ సినిమా, 'పరాశక్తి' వంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చాయి. మళ్లీ మేము షూటింగ్‌కు సిద్ధమయ్యేసరికి, ఆమె ఆ సినిమాలతో బిజీగా ఉండటంతో డేట్స్ క్లాష్ అయ్యాయి. ఆమెను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక, ఇరు పక్షాల అంగీకారంతోనే హీరోయిన్‌ను మార్చాల్సి వచ్చింది. ఇందులో శ్రీలీల పొరపాటు ఏమీ లేదు" అని నాగవంశీ వివరించారు.హీరోయిన్ మార్పుతో కొంత భాగం రీషూట్ చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. అయితే, సినిమా ఫైనల్ కాపీ చూశాక, ఈ పాత్ర కోసమే భాగ్యశ్రీ పుట్టిందా అన్నంత అద్భుతంగా నటించిందని నాగవంశీ ప్రశంసించారు.

ఇదే విషయంపై అక్కినేని నాగార్జున సైతం స్పందిస్తూ.. "భాగ్యశ్రీ నటన అమోఘం. ఆమె కోసం ఎన్ని యుద్ధాలైనా చేయొచ్చు అనిపించింది" అని కొనియాడారు.'మిస్టర్ బచ్చన్' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన భాగ్యశ్రీ బోర్సే, గ్లామర్‌తో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది.

అయితే, ఆమెకు ఇప్పటివరకు సరైన కమర్షియల్ హిట్ పడలేదు.

ఈ నేపథ్యంలో 'లెనిన్' విజయం అఖిల్‌తో పాటు భాగ్యశ్రీ కెరీర్‌కు కూడా ఎంతో కీలకంగా మారింది. ప్రస్తుతం సినిమాపై ఇండస్ట్రీలో పాజిటివ్ బజ్ నడుస్తుండటంతో, ఈ చిత్రంతో ఇద్దరూ భారీ విజయాన్ని అందుకుంటారని అక్కినేని అభిమానులు ఆశిస్తున్నారు.

## ఘనంగా ప్రారంభమైన నార్నే నితిన్ కొత్త సినిమా..

# ఇద్దరు హీరోయిన్లతో!




యంగ్ టైగర్ ఎన్టీఆర్ బావమరిది, యువ హీరో నార్నే నితిన్ తన కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాకు ఎచీచీ5 అనే వర్కింగ్ టైటిల్‌తో హైదరాబాద్‌లో ఆదివారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ చిత్రంలో నితిన్ సరసన ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. 'బుట్టబొమ్మ' ఫేమ్ అనిఖా సురేంద్రన్, కన్నడ నటి మేఘా శెట్టి కథానాయికలుగా ఎంపికయ్యారు.ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాధా కృష్ణ రెడ్డి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత వెంకట్ కె. నారాయణ క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కళ్యాణ్ శంకర్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.ఈ చిత్రానికి వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తుండగా, 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి చిత్రాలకు పనిచేసిన సెంథిల్ కుమార్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించనుండటం విశేషం. పూజా కార్యక్రమాల అనంతరం చిత్ర యూనిట్ త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని ప్రకటించింది. ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## విజువల్ వండర్‌గా 'అగధ'.. ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్




ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎం.ఎస్. రాజు రూపొందిస్తున్న మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. ఎన్నో అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 14, 2026న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ పతాకంపై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇటీవల విడుదలైన 'అగధ' టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. గ్రాండ్ విజువల్స్, ఆసక్తి రేకెత్తించే నేపథ్య సంగీతం, మిస్టీరియస్ వాతావరణంతో సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పింది. ఈ టీజర్‌కు 14 మిలియన్లకు పైగా వ్యూస్ రావడం విశేషం.

ఈ సందర్భంగా దర్శకుడు ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ, ""అగధ' నా కలల ప్రాజెక్ట్. టీజర్‌లో చూసింది చాలా చిన్న భాగం మాత్రమే. సినిమాలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఎన్నో అంశాలు ఉన్నాయి. ప్రతి ఫ్రేమ్‌ను ఒక విజువల్ వండర్‌గా తీర్చిదిద్దాం. భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూ, మైథాలజీ, మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలతో ఈ చిత్రాన్ని ఒక ఎమోషనల్ రోలర్ కోస్టర్ రైడ్‌లా రూపొందించాం" అని వివరించారు.నిర్మాత కాశీ విశాలాక్షి మాట్లాడుతూ, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సినిమాను నిర్మించామని, టీజర్‌కు వచ్చిన అద్భుతమైన స్పందన తమకు ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. 'మహాదేవి' పాత్ర తన కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుందని నటి కామాక్షి భాస్కర్ల అన్నారు. 'దర్టీ హరి' తర్వాత మళ్లీ ఎం.ఎస్. రాజుతో పనిచేయడం సంతోషంగా ఉందని హీరో శ్రవణ్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాకేష్ వెంకటాపురం సంగీతం అందించగా, నాని చమిడిశెట్టి సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు.

